ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 21-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

❖ అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు వినియోగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

❖ సరిహద్దు భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.

❖ సింగపూర్‌తో ఆసియా వ్యాప్తంగా ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించుకుంటామని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

❖ భారత నావికుల సంక్షేమం, భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

❖ బ్రిక్స్ యువజన, క్రీడా మంత్రుల సమావేశాలు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా రేపటి నుండి ప్రారంభం కానున్నాయి.

==================

అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల జీవితాలను మెరుగుపరిచే విధంగా వినియోగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అంతరిక్ష అంకుర సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారులు, వ్యవస్థాపకులతో ప్రధానమంత్రి న్యూఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అంతరిక్ష రంగానికి సంబంధించి ప్రపంచం భారతదేశం వైపు చూసే విధంగా అనుకూల వ్యవస్థను దేశీయంగా సృష్టించాలని సూచించారు. అప్పుడే దేశ అంతరిక్ష రంగం ప్రపంచ స్థాయి

ప్రతిభకు, పెట్టుబడులకు ఆకర్షణ కేంద్రంగా మారగలదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతరిక్ష పరిశ్రమ, ఇతర సామాజిక అభివృద్ధి రంగాల మధ్య మరింత సహకారం ఉండాలని కూడా నరేంద్ర మోదీ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = =

సరిహద్దు భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా  స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురిలో ఉన్న సశస్త్ర సీమా బల్ (SSB) ప్రధాన కార్యాలయంలో పలు ప్రాజెక్టులను ఆయన ఈరోజు ప్రారంభించారు. అదే విధంగా SSB క్యాంపులకు శంకుస్థాపన చేశారు.  అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ... నేపాల్, భూటాన్ వంటి దేశాలతో ఉన్న బహిరంగ సరిహద్దులను కాపాడే బాధ్యతను SSB సమర్థంగా నిర్వహిస్తోందని తెలిపారు. సిలిగురి కారిడార్ ప్రాముఖ్యతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాంతంలో నిఘాను పెంచిందని ఆయన పేర్కొన్నారు. చొరబాట్లను నివారించడం, పశ్చిమ బెంగాల్‌ను, దేశాన్ని సురక్షితంగా ఉంచడం కేంద్ర ప్రభుత్వం సంకల్పమని అమిత్ షా వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం, బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశాలకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుంది. బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం రేపు జరగనుండగా, బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం ఈనెల 23న జరగనుంది. ఈ సమావేశాలకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయా అధ్యక్షత వహించనుండగా, ఆ శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే సమావేశాలలో పాల్గొంటారు. యువత అభివృద్ధి, సాధికారతకు సంబంధించిన సహకారాన్ని బలోపేతం చేయడంపై బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం దృష్టి సారిస్తుందని యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమావేశంలో విద్య, నైపుణ్యాలు, సంక్షేమం, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొంది. బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశానికి  11 బ్రిక్స్ సభ్య దేశాల క్రీడా మంత్రులు, ప్రతినిధి బృందాలు హాజరవుతున్నాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = =

సింగపూర్‌తో ఆర్థిక భాగస్వామ్యాన్ని ఆసియా వ్యాప్తంగా పెంపొందించుకోవడానికి, వాణిజ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి భారతదేశం కట్టుబడి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ఇండియా-సింగపూర్ బిజినెస్ ఫోరమ్‌లో బిజినెస్ స్కూల్ INSEAD పూర్వ విద్యార్థులు, సింగపూర్ పారిశ్రామికవేత్తలు భారతీయ వ్యాపారవేత్తలను ఉద్దేశించి ఆయన ఈ రోజు ప్రసంగించారు. భారతదేశంలో పెట్టుబడి అవకాశాల గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. అదే విధంగా సింగపూర్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్య పరిశ్రమల శాఖ సహాయ మంత్రి గాన్ సియో హువాంగ్ ఇతర ప్రముఖులతో కూడా ఆయన సమావేశమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = =

ఇన్ఫ్లుయెంజా వ్యాధి విస్తరణపైన నిరంతర అప్రమత్తత, పటిష్టమైన నిఘా అవసరమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి. నడ్డా అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో హెచ్1ఎన్1 ఇన్ఫ్లుయెంజాకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని ఆయన ఈరోజు ఢిల్లీలో నిర్వహించిన శాఖాపరమైన సమావేశంలో  సమీక్షించారు. నిరంతరం లేదా తీవ్రమైన శ్వాసకోశ లక్షణాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఇతర హెచ్చరిక సంకేతాలు ఉన్న వ్యక్తులు వెంటనే వైద్య సలహా తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. హెచ్1ఎన్1తో సహా సీజనల్ ఇన్ఫ్లుయెంజా నియంత్రణ కోసం దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఆసుపత్రులు, ప్రయోగశాలలు ఇతర భాగస్వాములతో సమన్వయం కొనసాగిస్తున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

భారత నావికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులతో విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ... పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోందని చెప్పారు. విదేశీ జెండాలు కలిగిన రెండు నౌకలకు సంబంధించిన ఘటన గురించి ప్రస్తావిస్తూ... అందులోని 22 మంది భారత నావికులు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. వారి భద్రత గురించి తెలుసుకునేందుకు సంబంధిత అధికారులతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని రణధీర్ జైస్వాల్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

బ్రిక్స్ ఐసిటి ట్రాక్ సమావేశం సందర్భంగా టెలికమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీస్ (ఐసిటి) రంగాలలో సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి భారత్, బ్రెజిల్ దేశాలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయని కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ ఈరోజు తెలిపింది. పుణెలో జరిగిన 12వ `బ్రిక్స్ కమ్యూనికేషన్స్ మంత్రుల సమావేశం` సందర్భంగా కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, బ్రెజిల్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి ఫ్రెడెరికో డి సికేరా ఫిల్హో ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం డిజిటల్ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్తుందని, డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుందని సామాజిక మాధ్యమ పోస్ట్‌లో ఆ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = =

దేశంలోని చిన్న, సన్నకారు రైతులందరికీ కనీస మద్దతు ధర ప్రయోజనాలు అందేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో `ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ అభియాన్` ముఖ్యమైన కార్యక్రమంగా ఉంది. వినియోగదారులకు ధరల స్థిరత్వాన్ని కాపాడుతూనే.. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూసేందుకు ఈ పథకాన్ని 2018 సెప్టెంబర్ లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద గత కొన్నేళ్ళుగా బడ్జెట్ కేటాయింపులు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తెలిపింది. 2024-25లో ఈ పథకం కింద వాస్తవ వ్యయం సుమారు 5 వేల 400 కోట్ల రూపాయలు ఉండగా.. 2026-27 నాటికి అది 7 వేల కోట్ల రూపాయలకు పైగా పెంచబడిందని గుర్తు చేసింది.

= = = = = = = = = = = = = = = = = =

2026-27కి సంబంధించి ఇప్పటికే 6 కోట్ల 5 లక్షల రూపాయలకు పైగా ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలయ్యాయని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. ఇందులో నిన్నటి వరకు దాఖలైన 2 కోట్లకు పైగా ITR-3, ITR-4లు కూడా ఉన్నాయని పేర్కొంది. ITR-3, 4, 5, 7 దాఖలు చేయడానికి ఈ నెల 31వ తేదీ చివరి గడువు కావడంతో త్వరపడాలని పన్ను చెల్లింపుదారులను ఆ శాఖ కోరింది.

= = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = =

భారత్, మారిషస్ దేశాలు తమ ఇంధన భాగస్వామ్యాన్ని మరింతగా విస్తరించనున్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. పెట్రోలియం ఉత్పత్తులలో ఇప్పటికే ఉన్న భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకుంటూ.. ఇరు దేశాల మధ్య ఇంధన సహకారం, భవిష్యత్ ఇంధన భద్రత, స్వచ్ఛమైన ఇంధనాలపై ఎక్కువగా దృష్టి సారిస్తాయని సామాజిక మాధ్యమం పోస్టులో ఆయన ఈ రోజు పేర్కొన్నారు. గ్లోబల్ బయోఫ్యూయల్స్ అలయన్స్ వ్యవస్థాపక సభ్యురాలైన మారిషస్ తన జాతీయ బయోఫ్యూయల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేసిందని కేంద్రమంత్రి తెలిపారు. స్వచ్ఛమైన, సుస్థిరమైన ఇంధనాలలో సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఈ ఫ్రేమ్‌వర్క్ భారత్, మారిషస్‌లకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని హర్దీప్ సింగ్ పూరి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

ప్రవేశ స్థాయి న్యాయ సేవా పరీక్షలకు హాజరు కావాలనుకునే న్యాయ పట్టభద్రులకు గతంలో తప్పనిసరిగా ఉండాల్సిన మూడేళ్ల న్యాయవాద వృత్తి నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గిస్తూ.. సుప్రీం కోర్టు ఈరోజు తన మే 2025 నాటి తీర్పును సవరించింది.

= = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = =